క్లుప్తంగా

కేజీబీవీ సందర్శన



క్రోసూరు: క్రోసూరులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను మంగళవారం సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వరద సుబ్బారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణ, నిలిచిపోయిన నాడు–నేడు కింద చేపట్టిన అదనపు గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతానని తెలిపారు. అనంతరం 10, ఇంటర్ బాలికలతో మాట్లాడుతూ బాగా చదువుకుని తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్టమూరులో ఇరు కుటుంబాల మధ్య దాడులు

సత్తెనపల్లి: పాత కక్షల నేపథ్యంలో సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇరు కుటుంబాల మధ్య సోమవారం రాత్రి పరస్పర దాడులు జరిగాయి. దాడుల్లో నలుగురికి గాయాలయ్యాయి. తేళ్లూరి దేవకుమార్, తేళ్లూరి సుందరరావు, కందుకూరి సాయి, కందుకూరి పుల్లమ్మలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరిలో ఇరువురి పరిస్థితి విషమించటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు 200 మంది విద్యార్థులు గైర్హాజర్

సత్తెనపల్లి: పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం జరిగిన ఇంటర్ జనరల్, ఒకేషనల్ ప్రథమ సంవత్సర ఇంగ్లీష్ పరీక్షకు 200 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1,477 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,325 మంది హాజరు కాగా 152 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 292 మందికి గాను 244 మంది హాజరు కాగా 48 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సుఖ ప్రసవంపై అవగాహన పెంచాలి



ముప్పాళ్ళ: గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గర్భిణులకు సకాలంలో టీకాలు అందించి సుఖవంతమైన ప్రసవం జరిగేలా అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమం మంగళవారం జరిగింది. బాలికా విద్య, ఆహారం, సరైన వయసులో వివాహంపై అవగాహన కల్పించారు. వేసవి కాలంలో పిల్లలు, వృద్ధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పమిడిపాడు వైద్యురాలు వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ ఉస్మాన్, ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.పీటర్‌డేమియన్, ఎం.జోస్పిన్‌రాణి, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి గ్రామోత్సవం



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి 33వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆలయంలో హరేరామ నామ సంకీర్తన చేపట్టారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కసువు ఘర్షణ.. కేసు నమోదు

పెదకూరపాడు : ఇంటి వెలుపుల కసువు పోగు చూసే క్రమంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణకు దారి తీసింది. పెదకూరపాడు ఎస్‌ఐ గిరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గారపాడు గ్రామానికి చెందిన గోలి కొండలరావు, కొండమీద పూర్ణయ్య కుటుంబాల మధ్య కసువు పోసుకునే విషయమై ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో గాయపడిన కొండమీద పూర్ణయ్య ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించి కొండలరావు, గోపి, మహాలక్ష్మి, తిరుపతమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు.

అలంకార ప్రాయంగా మార్కెట్ యార్డు

- లేని వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు
- నిలిచిపోయిన సీసీఐ పత్తి కొనుగోళ్లు
- క్రోసూరు యార్డులో నిర్వహించేది కేవలం పశువుల సంత మాత్రమే

క్రోసూరు: రైతుల ప్రయోజనాల కొరకు ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లు ఏమీ జరగటం లేదు. ప్రభుత్వ కొనుగోళ్ల విధానాలు మారిపోవటంతో యార్డులో కేవలం కార్యాలయాలు, గోదాముల భవనాలు మినహా వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు లేకుండా పోయాయి. 25 సంవత్సరాల క్రితం క్రోసూరులో వ్యవసాయ మార్కెట్ యార్డును 10 ఎకరాల్లో ఏర్పాటు చేయటం జరిగింది. 2005లో యార్డులో గోదాములతో పాటు మార్కెట్ కమిటీ భవనం, వ్యవసాయ కార్యాలయం, అగ్రి ల్యాబ్, వాటర్ టెస్టింగ్ ల్యాబ్, రైతుల విశ్రాంతి భవనం, రక్షిత తాగునీరు (మినరల్ వాటర్ ప్లాంట్), టాయిలెట్లు నిర్మించారు. యార్డులోనే పశువుల సంత నిర్వహించుకునే విధంగా ఏర్పాటు చేశారు.

లేని క్రయ విక్రయాలు

రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు యార్డుకు చేర్చుకుని విక్రయించుకునేందుకు, రైతుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించే విధంగా క్రోసూరులో మార్కెట్ యార్డు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం రైతుల వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగని పరిస్థితి. రెండేళ్ల క్రితం వరకు సీసీఐ ద్వారా జరిగిన పత్తి కొనుగోళ్లు కూడా జరగటం లేదు. అందుకు అనేక కారణాలు చెబుతున్నారు. సీసీఐ నియమ నింధనల ప్రకారం తేమ శాతాన్ని బట్టి నాణ్యమైన పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నప్పటికీ కొనుగోళ్లు నిలిచిపోయాయి.



క్రోసూరు మార్కెట్ యార్డు



పాడైపోయిన వేబ్రిడ్జి



సీసీఐ పత్తి కొనుగోలు చేస్తున్నప్పుడు యార్డులో పత్తి (ఫైల్ ఫొటో)

మూలన పడ్డ వేబ్రిడ్జి

లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన వేబ్రిడ్జి రెండు సంవత్సరాల క్రితం సీసీఐ కొనుగోళ్లు జరుగుతున్నపుడు చెడిపోవటం జరిగింది. అప్పటి నుంచి పూర్తిగా మూలన పడేయటం జరిగింది.

నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా

పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రైతులు అధిక శాతం సుమారు 15 వేల హెక్టార్లలో మిర్చి, పత్తి, ధాన్యం, కొద్ది మాత్రం కందులు, ఇతర ఉత్పత్తులు సాగు చేస్తుంటారు. అయితే ధాన్యం, కందులు లాంటివి నేరుగా రైతు భరోసా కేంద్రాల్లో మార్కెఫెడ్ ద్వారా ఎంఎస్పీకి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండటంతో రైతులు వ్యయ ప్రయాసలకోర్చి యార్డుకు చేరుకోవాల్సిన పనిలేకుండా పోయింది.

ఇప్పటికీ లేని కోల్డ్ స్టోరేజీ

మార్కెట్ యార్డుకు కావల్సినంత స్థలం ఉన్నప్పటికీ ఎప్పటి నుంచో పాలకులు చెబుతున్నట్లు మిర్చి నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీ రూపుదాల్చుకోలేదు. పత్తి కొనుగోళ్లు లేవు. ఈ విధంగా నియోజకవర్గంలో అధికంగా పండించే పత్తి, మిర్చి కొనుగోళ్లు యార్డు ద్వారా లేకపోవటం, కోల్డ్ స్టోరేజీ లేక మిర్చి, పత్తి నిల్వచేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో మార్కెట్ యార్డు ప్రధాన లక్ష్యం కోల్పోయిందని రైతులు తెలుపుతున్నారు.

తక్కువ ధరకే విక్రయించాను



నేను 11 ఎకరాల్లో పత్తి, ఏడు ఎకరాల్లో మిర్చి సాగు చేసాను. కొంత సొంతం, కొంత కౌలుకు సాగు చేసాను. క్రోసూరు మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం లేకపోవటంతో సత్తెనపల్లిలోని ధూళిపాళ్ల మిల్లుకు చేర్చుకుంటే క్వింటా రూ.7,500కు కొనుగోలు చేస్తామంటున్నారు. అక్కడకు వెళ్లిన తరువాత ఎప్పుడు కొంటారో తెలియదు. అప్పటి వరకు రైతులు పడిగాపులు కాయాల్సిందే. దీనికి తోడు ఈ క్రాప్ చేయించాలి. కౌలుదారుకు ఈ క్రాప్ ఉండదు. పొలందారు పేరు మీద ఈ క్రాప్ తీసుకుంటే సీసీఐకు అమ్ముకున్న పత్తి నగదు పొలందారుని ఖాతాలో వేస్తారు. ఈ అవస్థలు పడలేక ఇంటి వద్దే క్వింటా రూ.5500కు విక్రయించుకున్నాను.

– విప్పల రాజశేఖరరెడ్డి, పీసపాడు, క్రోసూరు మండలం

కోల్డ్ స్టోరేజీ అవసరం ఉంది



రైతులు సాగు చేసిన మిర్చి విక్రయించుకొనేందుకు గుంటూరు యార్డుకు చేర్చుకోవాల్సిందే. అదే క్రోసూరు యార్డులో కోల్డ్ స్టోరేజీ ఉంటే బయ్యర్లు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేయటం జరుగుతుంది. తద్వారా రైతుకు చాలా వరకు ఖర్చులు మిగులుతాయి. మాజీ సీఎం జగన్ పాలనలో కోల్డ్ స్టోరేజీ నిర్మించాలన్న ప్రతిపాదనలున్నాయి.

– అనుమల కోటిరెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, క్రోసూరు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు

మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రభుత్వ నిబంధనల మేరకు వారి ఆదేశాల మేరకు జరుగుతాయి. ప్రస్తుతం యార్డులో వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోళ్లు ఏమీ జరగటం లేదు.

– ఈశ్వరరావు, యార్డు సెక్రటరీ. క్రోసూరు

పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి

జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ రామారావు

బెల్లంకొండ: పశు పోషకులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాక్సిన్‌లు వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ రామారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన బెల్లంకొండలో పశువులకు వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 31 వరకూ వ్యాక్సిన్‌లు వేస్తారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులు అనారోగ్యానికి గురైతే వెంటనే పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలని, సొంత వైద్యం చేయరాదని సూచించారు. అనంతరం పశు పోషకులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి బాలకృష్ణారెడ్డి, సిబ్బంది అరుణ, దేవయ్య, భార్గవ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

ఎస్‌ఐ నాగేంద్రరావు



క్రోసూరు: చిన్న చిన్న కేసుల నుంచి విముక్తి చేసుకుందామనుకునే వారు, పొరపాటుగా కేసులు అనుభవిస్తున్న వారు రాజీపడే అవకాశాన్ని ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ ద్వారా సద్వినియోగపరుచుకోవాలని ఎస్‌ఐ నాగేంద్రరావు తెలిపారు. మండలంలో రాజీ పడదగిన కేసులున్న వారు రాజీ పడేందుకు ముందుకు రావాలని కోరారు. రాజీ పడేందుకు సిద్ధపడితే పోలీసు స్టేషన్‌లో తగు విధంగా ముందుగా సిద్ధం చేసుకుని లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయనున్నట్లు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని రాజీపడదగ్గ కేసుల బాధితులు సద్వినియోగపరుచుకోవాలన్నారు.

రైతులు ఎలుకలను సామూహికంగా నివారించుకోవాలి



రైతులకు ఎలుకుల నివారణ మందును పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి



దమ్మాలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అరుణ

రాజుపాలెం: రైతులందరు కలసికట్టుగా ఒకేసారి సామూహికంగా విషపు ఎరను వరి పొలాల్లో పెట్టడం వలన ఎలుకలను నిర్మూలించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య తెలిపారు. మండలంలోని ఇనిమెట్ల రైతు సేవ కేంద్రంలో సామూహికంగా ఎలుకులను నివారించేందుకు మందును రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఆహార ధాన్యాల ఉత్పత్తి, నిల్వల్లో రైతులకు ప్రథమ శత్రువులు ఎలుకలని తెలిపారు. విత్తనం వేసింది మొదలు ధాన్యం అమ్మే వరకు ఎలుకలు వరి పైరుకు నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. అందుచేత రైతులు ఎలుకలను సమర్థవంతంగా నివారించుకోవాలని చెప్పారు. కాండాన్ని, మొవ్వలను తినడమేగాక కంకులను కత్తెరించి ఈడ్చుకొనిపోయి బొరియలలో దాచి ధాన్యాగారాలను ఏర్పరుచుకుంటాయని తెలిపారు. కావున రైతులందరు ఎలుకలను నివారించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సీహెచ్ రూప, జి.వెంకట్రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం

ముప్పాళ్ళ: రైతులందరూ విషపు ఎరను ఉపయోగించడం ద్వారా సామూహికంగా ఎలుకలను నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును 100% రాయితీపై సరఫరా చేస్తుందని చెప్పారు. 100 గ్రాముల విషపు ఎర తయారీకి 2 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును, 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె కలిపి ఒక్కొక్క సజీవ బొరియకు 10 గ్రాముల చొప్పున విషపు ఎరను పొట్లం కట్టి బొరియల్లో వేయాలని సూచించారు. ఈ విధంగా అన్ని గ్రామాల్లోను అవగాహన కల్పించి, తయారు చేసి రైతులకు అందించటం జరిగిందన్నారు. సామూహికంగా ఎలుకలను నివారించి తద్వారా వచ్చే నష్టాన్ని తగ్గించుకొని మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట రైతు సేవ కేంద్రంలో మంగళవారం మండల స్థాయి వ్యవసాయ శాఖ దాని అనుబంధ శాఖల అధికారులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు వ్యవసాయ ఉప సంయుక్త సంచాలకులు హనుమంతురావు మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంటకు ముందు ప్రతి ఒక్క రైతు తన పొలంలో పీఎండీఎస్ (నవధాన్య విత్తనాలు) చల్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా చీడపీడల నివారణ జరుగుతుందని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి మాట్లాడుతూ ప్రతి రైతు వారికున్న భూమిలో నవధాన్య విధానం ఆచరించడం వలన భూమిలో వివిధ సూక్ష్మజీవులు వృద్ధి చెంది భూమికి కార్బన్ శాతం చేరడంతో పాటు పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుందన్నారు. జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ రాజు మాట్లాడుతూ ప్రతి యానిమేటర్ తన పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి అహ్మద్ మాట్లాడుతూ ప్రతి రైతు అంతర పంటల విధానం ఆచరించాలని దీని వలన చీడపీడల ఉధృతి తగ్గి భూమి సారవంతమవుతుందని, అంతే కాకుండా ప్రతి రైతు సొంత విత్తనాన్ని వినియోగించాలని సూచించారు. వేసవికాలంలో కూడా విత్తనాలు మొలకెత్తడానికి వీలుగా విత్తన గుళికల విధానం ఎలా చేయాలో డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి శ్రీనిత్య, సెర్ప్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో చెత్త సంపద కేంద్రాలు పనిచేయాలి

శావల్యాపురం: ప్రతి గ్రామ పంచాయతీలలో చెత్త సంపద కేంద్రాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చేలా పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని డీఎల్‌పీవో వి.వి.ఎం.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని చినకంచర్ల గ్రామ పంచాయతీలో మేడిచెరువులో చేపల పెంపునకు బహిరంగ వేలంపాట గ్రామంలోని ఎంపీపీ స్కూలు ప్రాంగణంలో గ్రామస్తులు, పంచాయతీ అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ... జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు గ్రామాల్లో శానిటేషన్, తాగునీరు, ఇంటి పన్నులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్లు, వీధుల్లో వ్యర్థాలను క్లాప్ మిత్రలు చెత్త సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా పంచాయతీ నిధులతో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఇంటి పన్ను చెల్లింపుల్లో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. డివిజన్ పరిధిలో రూ. 12 కోట్లు బకాయి ఉందని, ఈ నెలాఖరులోగా నూరుశాతం వసూలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం చినకంచర్ల గ్రామ పంచాయతీ మేడిచెరువు బహిరంగ వేలంపాటలో మదమంచి సామ్రాజ్యం రూ. 3.70 లక్షలకు హక్కులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు చక్రవరపు లలితశ్రీవల్లీ, చింతా శ్రీనివాసరావు , గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు సేఫ్టీ చర్యలపై సర్వే



క్రోసూరు: క్రోసూరులో పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, క్రోసూరు పోలీసు శాఖ సంయుక్తంగా రోడ్ సేఫ్టీకి చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం సర్వే చేసినట్లు క్రోసూరు ఎస్‌ఐ నాగేంద్రరావు మంగళవారం తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కడ చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి, ఎక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టాలి, ఎక్కడ మలుపులున్నాయి, ఎక్కడ స్పీడ్ బ్రేకర్లు ఇవ్వాలి, హై లెవల్ బ్రిడ్జిలు, లో బ్రిడ్జిలు వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టేందుకు సర్వే చేసినట్లు తెలిపారు. అమరావతి మీదగా క్రోసూరు, క్రోసూరు నుంచి సత్తెనపల్లి వరకు పరిశీలించినట్లు తెలియజేశారు. త్వరలో హెచ్చరిక బోర్డులు పెట్టనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కిస్తే కేసులు పెడతాం



క్రోసూరు: ఆటోల్లో పరిమితికి మించి కూలీలు, ప్రజల్ని ఎక్కిస్తే తప్పనిసరిగా కేసులు పెడతామని ఎస్‌ఐ నాగేంద్రరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం క్రోసూరు ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటోల్లో మితి మీరి కూలీలు ఎక్కి వెళ్లవద్దని తెలిపారు. అదే విధంగా సంబంధిత ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు తిప్పితే కేసులు పెడతామని హెచ్చరించారు. రోడ్లపై వాహనాదారులు, ప్రయాణికులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దన్నారు. తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

దమ్మాలపాడులో 'పొలం పిలుస్తోంది'

దమ్మాలపాడు(ముప్పాళ్ళ):మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని రైతులందరూ తప్పనిసరిగా సాగు చేసిన పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పంట ఉత్పత్తులను అమ్ముకోవాలంటే పంట నమోదు తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతు గుర్తింపు సంఖ్య కొరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, సర్వే నెంబర్, ఫోన్ నెంబర్ తీసుకొని గ్రామంలోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. వీఏఏ, రైతులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా ఉన్న వెలుగు కార్యాలయం

ఉండీ.. ఉపయోగం లేదు

- ఏళ్లు గడుస్తున్నా అద్దె భవనంలోనే
- శాఖల మధ్య సమన్వయ లోపంతో నిరుపయోగంగా వెలుగు కార్యాలయం

పెదకూరపాడు: శాఖల మధ్య సమన్వయ లోపం .. లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం 14 ఏళ్లగా నిరుపయోగంగానే పడి ఉంది. ఆ భవనంలో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది నేటికీ అద్దె భవనంలోనే కునారిల్లుతున్నారు. గత 14 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ హయాంలో పెదకూరపాడు పోలీస్ స్టేషన్ ఆవరణలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన వెలుగు కార్యాలయం పాలకులు మారినా విధులు నిర్వహించడం లేదు. పోలీస్ శాఖ, వెలుగు సిబ్బంది సమన్వయ లోపంతో 14 సంవత్సరాలుగా నిరుపయోగంగానే పడి ఉంది. నిర్మించిన ఈ భవనానికి అనుమతులు ఇవ్వకపోవడంతో ఉండి ఉపయోగం లేకుండా పోయింది. వెలుగు విధులు నిర్వహించేందుకు ఆసక్తి చూపని పోలీసు అధికారుల నుంచి అనుమతులు లేకపోవడంతో అద్దె భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండటంతో.. సంపద సృష్టించటం కన్నా ఉన్న సంపదను వినియోగించుకుంటే మేలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

భద్రతతో కూడిన పని భవిష్యత్తుకు పునాది



కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దాచేపల్లి: భద్రతో కూడిన పని కార్మికుడి భవిష్యత్తుకు పునాది అని ప్లాంట్ హెడ్ సుబ్బారావు అన్నారు. గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. కార్మికులతో కలిసి అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ప్లాంట్ హెడ్ సుబ్బారావు మాట్లాడుతూ.. భద్రత విషయంలో కార్మికులు మెలకువగా ఉండాలని, భద్రతలేని పనులు చేసి ప్రమాదాలబారిన పడవద్దని సూచించారు. ఫ్యాక్టరీ అభివృద్ధితో పాటుగా కార్మికుడి భద్రత కూడా యజమాన్యానికి ముఖ్యమని చెప్పారు. 2024–25లో జీరో ప్రమాదాలతో ఉత్పత్తి జరిగిందని, ఈ ఏడాది కూడా ప్రమాదాలు జరగకుండా నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. సేఫ్టీ మేనేజర్ సంజయ్ సింగ్, అధికారులు నరేందర్‌రెడ్డి, నాగభూషణం, అంబేద్కర్ రెడ్డి, వీరప్రకాష్, రామకృష్ణ, గణేష్, నరసింహులు, వేణు, తారక్, అవినాష్ పాల్గొన్నారు.

నేడు భద్రతా వారోత్సవాలు ప్రారంభం

సత్రశాల(రెంటచింతల): స్థానిక పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆవరణలో బుధవారం నుంచి 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అధికారులు, కార్మికులతో కలిసి భద్రతా జెండాను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందన్నారు. భద్రతా ప్రదర్శనలతో అవగాహన పెంపొందించడానికి బుధవారం నుంచి 11వ తేదీ వరకు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.రాంబాబు, నరసరావుపేట కర్మాగారపు తనిఖీ అధికారులు వారోత్సవాలలో పాల్గొంటారన్నారు.

250 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఏడీబీ) శాఖ ముందు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ దత్తా హాస్పిటల్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, సిబ్బంది 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బ్యాంకు శాఖ మేనేజర్ ఎం.పాల్‌బెజాలీల్, ఫీల్డ్ ఆఫీసర్ ఎం.రమణయ్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

డిగ్రీ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో వాగ్దేవి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. బీసీఏ ఆనర్స్‌లో 550 మార్కులకుగాను ఉషశ్రీ 495, మృదుల 471, సింధూర 467, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో కళ్యాణి 479, కోటేశ్వరమ్మ 476, విజయ రామరాజు 475, బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్‌లో చందన 476, వసుంధర 472 మార్కులు సాధించినట్టు వివరించారు. విద్యార్థులను కార్యదర్శి శ్రీనివాసరావు, డైరెక్టర్లు రామకోటేశ్వరరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు అభినందించారు.

ఆశావర్కర్ల సేవలు ఎనలేనివి

నాదెండ్ల: గ్రామాల్లో ఆశావర్కర్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ఎల్.ప్రసాద్‌నాయక్, డాక్టర్ కవితాఅనసూయ చెప్పారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశావర్కర్ పఠాన్ షంషూన్‌ను ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కరించారు. పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.